క్లుప్తంగా

పాఠకుల సంఖ్య పెరగాలి


రికార్డులు పరిశీలిస్తున్న కార్యదర్శి రమ

తనకల్లు: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాన్ని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్య మరింత పెరగాలని సూచించారు. విద్యార్థులు, నిరుద్యోగులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సమన్వయంతో కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భువనేశ్వర్‌రెడ్డి

తాడిమర్రి: మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రంగారావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వీధిలైట్లు, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. అవసరం ఉన్న గ్రామాల్లో సీసీ రోడ్లను నిర్మించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బీసాని లింగమ్మ, తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, సూపరింటెండెంట్ నాగేంద్రకుమార్, ఈవోఆర్డీ విజయశేఖర్ నాయుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి


కదిరి కుంట్లపల్లి జగనన్న కాలనీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కదిరి అర్బన్: జగనన్న కాలనీలో మౌలికవసతులు కల్పించాలని కదిరి కుంట్లపల్లికి చెందిన లబ్ధిదారులు ఎంపీడీఓ పోలప్పను కోరారు. మంగళవారం ఎంపీడీఓ పాలిటెక్నిక్ కళాశాల వెనుక సర్వే నంబర్ 76–1లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. కరెంటు, రోడ్లు, తాగునీటి సదుపాయం కల్పించాలని లబ్ధిదారులు కోరారు. అనంతరం గంగన్నగారిపల్లి వద్ద హౌసింగ్‌కాలనీని ఎంపీడీఓ పరిశీలించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ గుప్తా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భానుప్రకాష్, హౌసింగ్ ఏఈ శివ పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి

చెన్నేకొత్తపల్లి: అంకితభావంతో పని చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సెల్వియా సాల్మన్ వైద్య సిబ్బందికి సూచించారు. ఎస్ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గాండ్లపెంట: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యాధికారి మహేశ్వర మారుతి తెలిపారు. మంగళవారం పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోనేలా అవగాహన కల్పించి, దోమలు వ్యాప్తి చెందకుండా నివారణ చేపట్టాలన్నారు. సమావేశంలో వైద్యాధికారి బాబాఫక్రుద్దీన్, సూపర్‌వైజర్లు ఉపేంద్రారెడ్డి, పార్వతమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడడం నేరం


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

తనకల్లు: రాకుంటపల్లిలో మంగళవారం రాత్రి వన్యప్రాణి వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అటవీశాఖాధికారులు మాట్లాడుతూ వన్యప్రాణులను కాపాడుకోవడం అందరి బాధ్యత అని తెలిపారు. వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఫారెస్టు బీట్ అధికారులు హరిప్రసాద్, వెంకటేషులు, అనిల్‌కుమార్, స్రవంతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయం.. గందరగోళం

- ఇరుకైన అద్దె ఇంటిలో నిర్వహణ
- రణగొణ ధ్వనులతో ప్రశాంతత కరువు
- గ్రంథాలయానికి స్థలం కేటాయింపులో నిర్లక్ష్యం


అద్దెభవనంలో నిర్వహిస్తున్న గ్రంథాలయం

కదిరి అర్బన్: విజ్ఞాన భాండాగారమైన గ్రంథాలయం ప్రశాంతతకు మారుపేరుగా ఉంటుంది. అలాంటి గ్రంథాలయం రణగొణ ధ్వనుల మధ్య, ఇరుకై న గదుల్లో నిర్వహిస్తుండటంతో పాఠకులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కదిరి పట్టణ జనాభా దాదాపు లక్ష దాకా ఉంది. మున్సిపల్ కార్యాలయం వద్ద అద్దె గదిలో నిర్వహిస్తున్న శాఖా గ్రంథాలయానికి నిత్యం వందలాదిమంది పాఠకులు వస్తుంటారన్నిక్కడ దినపత్రికలు, వార, పక్ష, మాస, త్రైమాసిక పత్రికలతో పాటు నవలలు, వివిధ రకాల పుస్తకాలు, పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థుల కోసం అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉన్నాయి. పై అంతస్తులో ఉన్న గ్రంథాలయానికి చేరుకునేందుకు మెట్లు ఎక్కాలంటే వృద్ధులు, రిటైర్డు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల పార్కింగ్‌కు తగిన స్థలం లేదు. రోడ్డుపైనే వాహనాలు నిలుపుతుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఈ మార్గంలో వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో రణగొణ ధ్వనుల మధ్య పాఠకులు ప్రశాంతంగా చదువుకోలేని పరిస్థితి ఉంది. ఇక్కడ మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేదు. ప్రభుత్వం చెల్లించే అద్దెకు పట్టణ పరిధిలో భవనం దొరకడం లేదు. అందుకే ఇరుకైన గదులతో కూడిన భవనంలో కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం రూ.8వేలు అద్దె చెల్లిస్తున్నారు. అన్ని సౌకర్యాలతో కూడుకున్న భవనం కావాలంటే రూ.15వేల దాకా అద్దె చెల్లించాల్సి ఉంటుందని పలువురు అంటున్నారు.

స్థలం కేటాయింపులో తాత్సారం

శాఖా గ్రంథాలయానికి ఐదు సెంట్ల స్థలం అవసరమని అధికారులు చెబుతున్నారు. స్థలం కేటాయించాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ తాత్సారం చేస్తున్నట్లు తెలిసింది. గతంలో ఆర్డీఓగా పనిచేసిన రాజశేఖర్ గ్రంథాలయానికి వేమారెడ్డి సర్కిల్‌లో ప్రభుత్వ ఉన్నతపాఠశాలకు సమీపాన ఐదు సెంట్ల స్థలం కేటాయించారు. తర్వాత దానిని గ్రంథాలయ వారికి అప్పగించలేదు. ఇప్పుడు ఆ స్థలం ఏమైందో కూడా తెలియడం లేదు. రెవెన్యూ వారు స్థలం కేటాయిస్తే పూర్తిస్థాయి సదుపాయాలతో పక్కా భవనం నిర్మించడానికి అవకాశం ఉంటుందని పాఠకులు చెబుతున్నారు.

ప్రశాంతంగా చదవలేరు



కదిరిలోని శాఖా గ్రంథాలయం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. పోటీ పరీక్షలకు సబంధించిన పుస్తకాలు ఉన్నాయి. అయితే ట్రాఫిక్ అధికంగా ఉన్న ప్రాంతంలో అదీ ఇరుకైన గదుల్లో లైబ్రరీ నిర్వహిస్తుండటంతో పాఠకులు ప్రశాంతంగా చదువుకోలేని పరిస్థితి ఉంది. ఏకాగ్రతతో చదువుకోవాలంటే గ్రంథాలయ భవనం విశాలంగా ఉండాలి. ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– చంద్రశేఖర్, కదిరి

స్థలం ఇంతవరకు చూపలేదు



ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 75 గ్రంథాలయాలు ఉన్నాయి. ఇందులో 43 గ్రంథాలయాలు పక్కా భవనాల్లో కొనసాగుతున్నాయి. 32 గ్రంథాలయాలు అద్దెభవనంలో నిర్వహిస్తున్నాం. కదిరిలో గ్రంథాలయానికి స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఎన్నోసార్లు కోరాం. ఇంతవరకు ఎక్కడా స్థలం కేటాయించలేదు. ముందు స్థలం కేటాయిస్తే తర్వాత పక్కా భవనం ఏర్పాటు చేయొచ్చు.

– రమ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

సస్యరక్షణతో మంచి దిగుబడులు


వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

పుట్టపర్తి: వరి, మొక్కజొన్న పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కో–ఆర్డినేటర్ రామసుబ్బయ్య, ఏఓ సతీష్, ఉద్యాన అధికారి నవీన్‌కుమార్ రైతులకు సూచించారు. వారు ఏఈఓలు సునీత, సుధ, సిబ్బంది, రైతులతో కలిసి మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా బుక్కపట్నం మండలం మారాల గ్రామ పరిధిలో వరి, మొక్క జొన్న, వేరుశనగ పంటలను పరిశీలించారు. ప్రస్తుతం మొక్క జొన్న పంటలో టార్చికం బ్లయిట్ అనే వ్యాధి సోకిందని, దీని నివారణ కోసం లీటర్ నీటిలోకి 2 గ్రాముల మ్యాంకోజిట్ మందు కలిపి పిచికారి చేయాలని అధికారులు సూచించారు. వరిలో రసం పీల్చే పురుగులు ఆశించాయని, దీని నివారణకు సకాలంలో మందులు పిచికారి చేయాలని చెప్పారు.

నేడు మండల మీట్

చెన్నేకొత్తపల్లి: మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివశంకరప్ప మంగళవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

మూడోరోజూ కొనసాగిన నిరసన


నిరసన తెలుపుతున్న నాయకులు, ఉద్యోగులు

ధర్మవరం అర్బన్: ఓవర్ టైం డ్యూటీలు తగ్గించాలని ఆర్టీసీ ఉద్యోగులు మూడోరోజూ మంగళవారం నిరసన కొనసాగించారు. ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కేబీ నాగార్జునరెడ్డి, డిపో కార్యదర్శి ముస్తఫా ఆధ్వర్యంలో ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్‌లో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ ఏడీసీలు మల్లికార్జున, టీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ


దుస్తులు అందజేస్తున్న ఎంపీపీ

ముదిగుబ్బ: విజయదశమి పండుగను పురస్కరించుకొని మండలంలోని 36 మంది పారిశుధ్య కార్మికులు, ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులకు మంగళవారం ఎంపీపీ ఆదినారాయణ దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌భాస్కర్, ఈఓఆర్‌డీ దివాకర్, పంచాయతీ కార్యదర్శి మంజుల పాల్గొన్నారు.

రస్తా వివాదంలో కేసు నమోదు

కదిరి అర్బన్: రస్తా వివాదంలో వీరేపల్లిపేటకు చెందిన రమణ, అతని భార్య అరుణమ్మలపై కేసు నమోదు చేసినట్లు కదిరి రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన సురేంద్రరెడ్డి అనే వ్యక్తి తన పొలంలోని కాలిబాటలో నడుచుకుంటూ వచ్చిన రమణ దంపతులను అడ్డుకున్నాడు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. తనపై రమణ, అరుణమ్మలు దౌర్జన్యం చేశారని సురేంద్రరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

శ్రీకాళహస్తికి బస్సు సౌకర్యం కల్పించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ రాము

ఎన్‌పీకుంట: కదిరి డిపో నుంచి ఎన్‌పీ కుంట, రాయచోటి, తిరుపతి మీదుగా శ్రీకాళహస్తికి బస్సు సౌకర్యం కల్పించాలని ఎంపీపీ ఈటె రాము ఆర్టీసీ అధికారులను కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో చేపట్టిన, చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరుపై అధికారులతో చర్చించారు. నాడు–నేడు కింద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారికి ఎంపీపీ ఆదేశించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో బస్సు వేళల బోర్డును ఏర్పాటు చేయాలని, సమయానికి అనుగుణంగా బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను కోరారు. టీఎస్ పల్లి పంచాయతీలో ఉపాధి హామీ సిబ్బంది అవకతవకలకు పాల్పడుతున్నారని గ్రామానికి చెందిన పలువురు సభలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా అటవీ శాఖ, రోడ్లు, భవనాలు, మైనర్ ఇరిగేషన్, పంచాయతీరాజ్, పశు సంవర్ధక శాఖ అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంపై అధికారులు, ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సురేంద్ర, ఎంపీడీఓ మనోహర్‌బాబు, ఈఓఆర్డీ మాధవరెడ్డి, వైస్ ఎంపీపీలు కేశవరెడ్డి, సంపూర్ణ, ఎంపీటీసీలు మగ్బూల్‌బీ, సరస్వతి, క్రిష్ణమ్మ, కొత్త రంగారెడ్డి, తిమ్మారెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు సుబహాన్, సర్పంచులు అంజినమ్మ, ఈటె రాధ, చంద్రకళ, నాగమునీశ్వరనాయుడు, విష్ణుమూర్తి, వివిధ శాఖల అధికారులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బదిలీ అధికారులకు సన్మానం


ఎన్‌పీకుంటలో అధికారులను సన్మానించిన దృశ్యం

ఎన్‌పీకుంట: బదిలీపై వెళుతున్న అధికారులకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. బదిలీ అయిన ఈఓఆర్డీ మనోహర్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ లోకా మల్లికార్జునరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జయమ్మ, టైపిస్ట్ రవిని సత్కరించి, వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ రాము, ఈఓపీఆర్డీ మాధవరెడ్డి, ప్రత్యేక అధికారి సురేంద్ర, ఏఓ లోకేశ్వరరెడ్డి, ఏపీఓ చంద్రశేఖర్, ఎంఈఓ సుబ్బిరెడ్డి, వైస్ ఎంపీపీలు కేశవరెడ్డి, సంపూర్ణ, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీనియర్ సహాయకుడికి సత్కారం


గాండ్లపెంటలో ఫైరోజ్ దంపతులను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

గాండ్లపెంట: మండల కేంద్రం గాండ్లపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ సహాయకుడిగా పని చేస్తూ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొంది అనంతపురం బదిలీ అయిన ఫైరోజ్‌ను మంగళవారం వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. కదిరి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగేంద్రనాయక్ ఆధ్వర్యంలో వైద్యాధికారులు మహేశ్వరమారుతి, బాబాఫక్రుద్దీన్ సహచర సిబ్బంది ఫైరోజ్ దంపతులను సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయం వద్ద టీడీపీ ఫ్లెక్సీ


ఎంపీడీఓ కార్యాలయం వద్ద టీడీపీ మండల కన్వీనర్ ఫొటోతో ఉన్న ఫ్లెక్సీ

కదిరి అర్బన్: ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రభుత్వ కార్యక్రమాల ఫ్లెక్సీలు, బోర్డులు వేస్తుంటారు. అయితే కదిరిలో ఎంపీడీఓ కార్యాలయం వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో పాటు టీడీపీ మండల కన్వీనర్ చెన్నకేశవులు ఫొటోతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం విమర్శలకు తావిచ్చింది. ఇది ప్రభుత్వ కార్యాలయమా లేక రాజకీయ పార్టీ కార్యాలయమా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ పోలప్పను వివరణ కోరగా.. తాను వద్దన్నా రాత్రిపూట ఫ్లెక్సీ వేసేశారన్నారు. ఫ్లెక్సీ తొలగించి.. ప్రభుత్వ పథకాల ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

జూడో పోటీల్లో చిగిచెర్ల విద్యార్థికి పతకం


పతకం సాధించిన అఫ్జల్ మెహరాజ్‌తో పీడీ ప్రతాప్‌రెడ్డి

ధర్మవరం రూరల్: జాతీయస్థాయి అండర్–14 జూడో పోటీల్లో చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అఫ్జల్ మెహరాజ్ పతకం సాధించినట్లు పీడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గుజరాత్ మెహసనలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన 68వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో 50 కేజీల విభాగంలో అఫ్జల్ మెహరాజ్ కాంస్య పతకం సాధించాడని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు తిమ్మారెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

వేరుశనగలో పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి: మండలంలోని ఈదుల ముష్టూరు, దంపెట్ల రెవెన్యూ గ్రామాల్లో వర్షాధారం కింద సాగు చేసిన వేరుశనగ పంటల్లో మంగళవారం మండల గణాంక అధికారి డాక్టర్ కెఎస్ లక్ష్మీనరసింహశర్మ ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈదుల ముష్టూరులో సాకే ఆదెప్ప పొలంలో 1,780 గ్రాములు, దంపెట్లలో నరసింహుడు పొలంలో 1, 850 గ్రాములు, ఓబులమ్మ పొలంలో 2,750 గ్రాముల దిగుబడి వచ్చినట్లు అధికారులు గుర్తించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ సత్యనారాయణ, ఎంపీఈఓ రవి, వీఏఏ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ పట్టివేత



బత్తలపల్లి: మండలంలోని చిత్రావతి నది నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను ఎస్ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి మంగళవారం బత్తలపల్లి బైపాస్ రోడ్డులో పట్టుకున్నారు. ఇసుకను అక్రమంగా ఎవరు తరలించినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

దేవీ వైభవం

దేవీ నవరాత్రులు వైభవంగా సాగుతున్నాయి. ఆరో రోజు మంగళవారం ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. – సాక్షి బృందం


బత్తలపల్లిలో లలితా త్రిపుర సుందరిగా మహాలక్ష్మీదేవి


కదిరిలో రాజరాజేశ్వరిదేవి అలంకారంలో చౌడేశ్వరి


అమడగూరులో మహాలక్ష్మీదేవిగా చౌడేశ్వరమ్మ


ముదిగుబ్బలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అలంకరణలో వాసవీ మాత


పుట్టపర్తిలో ధనలక్ష్మిగా సత్తెమ్మ దేవత


తలుపులలో అన్నపూర్ణాదేవిగా వాసవీమాత


తాడిమర్రిలో ధనలక్ష్మీ అలంకారంలో వాసవీమాత


నల్లమాడలో సరస్వతీదేవి అలంకారంలో కొత్తబావి గంగమ్మ


శాకాంబరిగా కొత్తచెరువు పెద్దమ్మతల్లి


ధర్మవరంలో కాత్యాయనీదేవిగా టీచర్స్‌కాలనీ చౌడేశ్వరి


కదిరిలో అన్నపూర్ణ అలంకారంలో మహాలక్ష్మి దేవి


ధర్మవరంలో లలితాదేవిగా నేసేపేట చౌడేశ్వరీదేవి


నల్లచెరువులో మహాలక్ష్మి అలంకరణలో వాసవీమాత

ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వండి

తలుపుల : మండలంలో అభివృద్ధి, అభివృద్ధేతర పనుల గురించి అయినా సరే ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని ఎంపీపీ రఫినాయక్ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఏఓ రామానాయక్ మంగళవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. పక్కా గృహాల సమాచారం ప్రజాప్రతినిధులకు కచ్చితంగా ఇవ్వాలని ఎంపీపీ సూచించారు. నూతన కాల్వ, దండువారిపల్లి గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, రెండు బోర్లు వేయించాలని సర్పంచ్ షేక్షావలి కోరారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్న వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని సర్పంచ్ మల్లినాయుడు విజ్ఞప్తి చేశారు. కదిరి నుంచి తలుపులకు ప్రయాణికుల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ సర్వీసులు నడపాలని సభ్యులు ఏడీఎం పెద్దన్న దృష్టికి తెచ్చారు. ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాదికి రూ.1.92 కోట్ల సీసీరోడ్లు మంజూరు అయ్యాయని ఏపీఓ హారూన్ రషీద్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రెడ్డిశేఖర్, వైస్ ఎంపీపీ ఓబులేశ్వరి, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.